# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఉద్యోగాల కల్పనలో భాగంగా రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- రాష్ట్రంలో ఆక్వా రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ అన్నారు.
- సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో తిరుమల లడ్డూ వ్యవహారంలో సిట్ తన దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేసిందని డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు.
- ఆంధ్రప్రదేశ్ లో కానిస్టేబుల్ నియామక ప్రక్రియను సత్వరమే  చేపడతామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.
- శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఈరోజు ఘనంగా ప్రారంభం అయ్యాయి.

========================

ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు కర్నూలు జిల్లా పుచ్చకాయలమడలో ముఖ్యమంత్రి లబ్ధిదారులకు పించన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ... దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని తెలిపారు. డిసెంబర్ లో మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తామని అనంతరం ఉద్యోగాలను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

.

(వాయిస్ 30 సెకన్లు)

========================

రాష్ట్ర జిడీపిలో 3వ వంతు ఆదాయం వస్తున్న ఆక్వా రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ అన్నారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో కేంద్ర ప్రాయోజిత పథకాలపై వైద్య ఆరోగ్య, వ్యవసాయ, సహకార, ఉద్యానవన, మత్స్య, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు కేంద్ర ప్రాయోజిత పథకాలను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేసి, రాష్ట్రానికి మరిన్ని పథకాలు, నిధులను రాబట్టేందుకు కృషి చేయాలని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర తదితర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తగిన నిధులు మంజూరు అయ్యేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రం నుండి నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులు పెద్దఎత్తున ఎగుమతి అయ్యే దిశగా చర్యలు తీసుకోవాలని నీరభ్ కుమార్ తెలిపారు.

=======================

ఆంధ్రప్రదేశ్ లో కానిస్టేబుల్ నియామక ప్రక్రియను సత్వరమే చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఈరోజు ఆమె అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ, 6 వేల 100 పోస్టుల భర్తీకి సంబంధించిన శారీరక సామర్థ్య పరీక్షలను 5 నెలల్లోగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. భర్తీ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు (slprb.ap.gov.in) వెబ్ సైట్ లో పొందుపరుస్తామని పేర్కొన్నారు. రెండవ దశలో ఉత్తీర్ణులైన వారికి 3వ దశ ప్రధాన పరీక్ష జరుగుతుందని మంత్రి వెల్లడించారు.

=======================

తిరుమల లడ్డూ వ్యవహారంలో సుప్రీం కోర్టులో తీర్పు నేపథ్యంలో సిట్ తన దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేసిందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సిట్ అధికారులతో డీజీపీ తిరుమలరావు ఈరోజు సమావేశమయ్యారు. గత మూడు రోజులుగా కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ నిర్వహించిన దర్యాప్తు వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్ లో ఉన్న ఎ.ఆర్.డైరీ, తిరుపతిలోని టిటిడి గోడౌన్ల పరిశీలన, ఈస్టు పోలీస్టేషన్ లో టిటిడి మార్కెటింగ్ విభాగం చేసిన ఫిర్యాదు తదితర అంశాలను డిజిపి తెలుసుకున్నారు.

=======================

రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డుదారులందరికీ కంది పప్పు, పంచదార పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈరోజు అమరావతిలో మంత్రి మాట్లాడుతూ, పేదలకు నిత్యవసర సరుకులను అందుబాటు ధరల్లోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా కిలో 163 రూపాయలు ధర ఉన్న కందిపప్పును రేషన్ కార్డుదారులకు 67 రూపాయలకే అందిస్తున్నామని అన్నారు. ఈ రోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కిలో కందిపప్పు, అరకిలో పంచదారను అందిస్తామని మంత్రి వెల్లడించారు.

=======================

"స్వచ్ఛతా హీ సేవా" కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగర పాలక సంస్థ జలాభిషేకం పేరుతో ప్రముఖుల విగ్రహాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఒంగోలులోని 110 విగ్రహాలను మేయర్, కమిషనర్, మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. అనంతరం నగర మేయరు గంగాడ సుజాత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు "స్వచ్ఛతా హీ సేవా"లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నెలా ఒకటవ తేదీన నగరంలో ఉన్న విగ్రహాలు అన్నింటిని శుభ్రం చేయనున్నట్టు ఆమె తెలిపారు.

విరామం

=======================

రెండు సంవత్సరాల కాల పరిమితితో నూతన మద్యం విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ ఏడాది అక్టోబరు 12 నుంచి 2026 సెప్టెంబరు 30 వరకూ ఈ విధానం అమల్లో ఉంటుంది. మొత్తం 3 వేల 396 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి నోటిఫికేషన్ ను విడుదల చేసింది. దీనితో ఈరోజు ఉదయం నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించింది. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా పెట్టుకోవచ్చు. ఒక్కో దానికి 2 లక్షల రూపాయల చొప్పున నాన్ రిఫండబుల్ రుసుము చెల్లించాలి. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో లాటరీ తీసి, లైసెన్సులు కేటాయించనున్నారు. ఈ నెల 11వ తేదీన ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి లైసెన్సుదారులు కొత్త దుకాణాలు ప్రారంభించుకోవచ్చు. ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చేంత వరకూ ప్రస్తుతమున్న ప్రభుత్వ దుకాణాలే కొనసాగుతాయని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.

=======================

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. కొత్తమ్మ తల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ... ఈ సంవత్సరం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయటంతో అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు హాజరై అమ్మవారికి ప్రభుత్వ లాంచనాలతో నూతన వస్త్రాలు, కానుకలు అందజేశారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

=======================

జీ ఎం సి బాలయోగి స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దుతామని అమలాపురం పార్లమెంటు సభ్యులు జీ ఎం హరీష్ అన్నారు. ఈరోజు అమలాపురంలో మాజీ లోక్ సభ స్పీకర్, దివంగత జి.ఎం.సీ బాలయోగి 73వ జయంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాలకు అంకితభావంతో సేవ చేసిన నాయకుడు బాలయోగి అని  అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి భావితరాలకు ఆదర్శమని కొనియాడారు. బాలయోగి అడుగుజాడల్లో కోనసీమ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. స్టేడియం అభివృద్ధికి కావల్సిన అన్ని అనుమతులు లభించాయని.. త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎంపీ హరీష్ తెలిపారు.

=======================

విజయనగరం జిల్లాలో ఈ నెల 13న జరిగే విజయనగరం ఉత్సవాలు, 14, 15 తేదీల్లో నిర్వహించే శ్రీ పైడిమాంబ తొలేళ్లు, సిరిమానోత్సవానికి భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందల్ పోలీసు అధికారులతో ఈరోజు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం ఉత్సవాలు, తొలేళ్ళు రోజున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాల్లో ప్రత్యేకంగా  ఏర్పాటు చేయాలన్నారు. సిరిమానోత్సవం రోజున సిరిమాను తిరిగే మార్గంలో పటిష్టబందోబస్తు  ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అధికారులకు సూచించారు.

=======================

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం ఏరియా కమిటీకు చెందిన 17 మంది మిలీషియా సభ్యులు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమిత్ బర్దార్ ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా ఎస్పి విలేకరాలతో మాట్లాడుతూ... పెదబయలు మండలం  గిన్నెలకోట, లండులు, ఇంజరి ప్రాంతాల్లో అనేక నేరాలకు పాల్పడిన ఈ మిలీషియ సభ్యులు జన జీవన స్రవంతిలో కలవడానికి స్వచ్ఛందంగా లొంగిపోయారని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అనేక సంక్షేమ పథకాలు, సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని, అదే విధంగా కుటుంబ సభ్యుల అభివృద్ధికి  తోడ్పడాలని  ఈ సందర్భంగా ఎస్పీ పిలుపునిచ్చారు.

=======================

యువ ఓటర్లు నమోదు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియజేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొన్నారు.

=========================

=========================